ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

కన్నెపల్లి, మార్చి 11 : కన్నెపల్లి ఎస్ఐగా గంగారాం, భీమిని ఎస్ఐగా విజయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీరికి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

దండేపల్లి ఎస్ఐగా స్వరూప్

దండేపల్లి, మార్చి11: దండేపల్లి ఎస్ఐగా స్వరూప్‌రాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎస్ పెద్దపెల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. స్టేషన్ సిబ్బంది ఎస్సైకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నీల్వాయి ఎస్ఐగా శ్యాం..

వేమనపల్లి, మార్చి 11 : నీల్వాయి ఎస్ఐగా శ్యాంపటేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సుబ్బారావు రామగుండంకు బదిలీ కాగా నెన్నెల ఎస్ఐగా పనిచేస్తున్న శ్యాంపటేల్ నీల్వాయికి వచ్చారు.

ఎస్ఐకి సన్మానం

జైపూర్, మార్చి 11: జైపూర్ ఎస్ఐ ఉపేందర్‌రావు రామగుండం కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా బదిలీ అయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పని చేస్తున్న శ్రీధర్ జైపూర్‌కు బదిలీ కాగా సోమవారం ఆయన బాధ్యతలు సీకరించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఎస్ఐని ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ బన్సీలాల్, నూతన ఎస్ఐ శ్రీధర్, జైపూర్ అదనపు ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐలు అజీజ్, ఇజాస్, సిబ్బంది సన్మానించారు.

ప్రశాంతంగా పరీక్షలు

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : జిల్లా కేంద్రంలో 25 కేంద్రాల్లో నడుస్తున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా కేంద్రాలను డీఐఈవో శైలజ తనిఖీ చేశారు. మొత్తం 7286 విద్యార్థులకు గాను 6776 మంది పరీక్షలకు హాజరుకాగా 510 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

వైద్యుడికి సన్మానం

మందమర్రి, మార్చి 11: బదిలీపై వెళ్తున్న సింగరేణి బెల్లంపల్లి ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ రాజేశ్వర్‌ను మందమర్రి మూడోజోన్ కాలనీలో సోమవారం సింగరేణి సేవాసమితి సభ్యులు సన్మానించారు. సేవా సమితి సభ్యురాలు నిరోష, వైజయంతికుమార్, అంజన్న, లావణ్య, పర్వీన్, మాధవి, తిరుమల, రాజేశ్వరి, భార్గవి, ప్రజ్వల, రోజా పాల్గొన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్

తాండూర్/ బెల్లంపల్లి రూరల్, మార్చి 11: మండలంలోని కన్నాల , భీమిని మండలంలోని భీమిని రైతువేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు మామిడి పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని బెల్లంపల్లి వ్యవసాయాధికారి వందన, హార్టికల్చర్ ఆఫీసర్ సుప్రజ తెలిపారు. సంగారెడ్డి పండ్లతోటల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర వీడియో కాన్ఫరెన్స్‌లో మామిడి రైతులకు సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో బెల్లంపల్లి, భీమిని ఏడీఏలు సురేఖ, ఇంతియాజ్ పాల్గొంటారన్నారు. మామిడి రైతులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

సీసీసీ నస్పూర్, మార్చి 11: ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న నస్పూర్ మున్సిపాలిటీ టీపీఎస్, అధికారులపై చర్యలు తీసుకోవాలని 17వ వార్డు కౌన్సిలర్ మేకల దాసు మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశానికి వచ్చిన కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూముల్లో అనుమతి లేని ఇండ్ల నిర్మాణం పనులను ప్రోత్సహిస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీరాంపూర్ ఓసీపీ గని ద్వారా వచ్చే దుమ్ముతో సమీపంలో నివసిస్తున్న ప్రజలు శ్వాస కోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని 19వ వార్డు కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బ్లాస్టింగులతో ఇండ్లు పగుళ్లు తేలుతున్నాయని, ఆధునిక సిస్టంతో బ్లాస్టింగ్ చేయాలని, దుమ్ము రాకుండా వాటర్ స్ప్రే చేసేలా సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు.

టాయిలెట్లు ప్రారంభం

మంచిర్యాలటౌన్, మార్చి 11: మంచిర్యాల కూరగాయల మార్కెట్‌లో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సొంత నిధులతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ప్రారంభించారు. ఇటీవల ఎమ్మెల్యే మార్కెట్‌లో పర్యటించిన సందర్భంలో స్థానిక వ్యాపారులు, వినియోగదారులు మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి మరుగుదొడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు పూదరి తిరుపతి, తూముల నరేశ్, మార్కెట్ వ్యాపారులు పాల్గొన్నారు.

పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి

మంచిర్యాల మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్మన్

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- రూ. 59.19 కోట్లతో మంచిర్యాల మున్సిపల్ బడ్జెట్
- రూ. 24.44 కోట్లతో నస్పూర్ మున్సిపల్ బడ్జెట్

మంచిర్యాలటౌన్, మార్చి 11: పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ మంచిర్యాల మున్సిపల్ బడ్జెట్‌ను రూ. 59. 19 కోట్లతో రూపొందించారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరుల్లో పన్నుల రూపేణా ఈ ఏడాది రూ. 13 కోట్లు, అసైన్డ్ రెవెన్యూ రూపేణా రూ. 2.52 కోట్లు, రెంటల్ ఇన్‌కమ్ రూ. 3.20 కోట్లు, ప్రజారోగ్యం, శానిటేషన్ సెక్షన్ రిసిప్ట్ ద్వారా రూ. 50.62 లక్షలు, పట్టణ ప్రణాళికా విభాగం రిసిప్ట్ ద్వారా రూ. 10.09 కోట్లు, ఇంజినీరింగ్ సెక్షన్ ద్వారా రూ. 3.58 కోట్లు, నాన్‌ప్లాన్ గ్రాంటు ద్వారా రూ. 6.04 కోట్లు, ప్లాన్ గ్రాంటు ద్వారా రూ. 95 లక్షలు, ఇతర గ్రాంటుల ద్వారా రూ. 18.92 కోట్లు కలిపి మొత్తం రూ. 59.19 కోట్లు ఆదాయం సమకూరుతుందని చిత్తు అంచనాలు తయారు చేశారు. ప్రారంభ నిలువ మొత్తం రూ. 8.89 కోట్లుగా పేర్కొన్నారు. ఖర్చుల్లో వేతనాలు, పారిశుధ్య నిర్వహణ వ్యయం, రుణాలు, గ్రీన్‌బడ్జెట్ కలిపి రూ. 19.56 కోట్లు, ఇంజినీరింగ్ సెక్షన్ నిర్వహణ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ , టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఖర్చులు కలుపుకుని రూ. 5.39 కోట్లు, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ కింద రూ. 7.96 కోట్లు, మున్సిపల్ జనరల్ ఫండ్ రూ. 32.91 కోట్లు, డిపాజిట్లు, రుణాల కింద రూ. 36 లక్షలు, నాన్‌ప్లాన్ గ్రాంట్లు, ప్లాన్‌గ్రాంట్లు, ఇతర గ్రాంట్లు కలిపి రూ. 25.92 కోట్లు ఖర్చు చేయనున్నట్లుగా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్, మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కమిషనర్ మారుతీప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, మేనేజర్ విజయ్‌కుమార్, ఏఈ రాజేందర్, ఆర్‌వో శ్రీనివాసరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాథోడ్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

సీసీసీ నస్పూర్, మార్చి 11: నస్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం పనిచేయాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో 2024-25 వార్షిక బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. జేఏవో సీహెచ్ అనితాదేవి బడ్జెట్ ఎజెండాను ప్రవేశపెట్టారు. రూ.24.44 కోట్ల ఆర్థిక బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్, మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, కమిషనర్ చిట్యాల సతీశ్, ఇంజినీర్ మధు, రెవెన్యూ అధికారి సతీశ్, టీపీఎస్ సతీశ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రూ. 13.50 కోట్లతో రాళ్లవాగుపై హైలెవెల్ వంతెన

- తీరనున్న పట్టణవాసుల చిరకాల కోరిక
- నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పీఎస్సార్ శంకుస్థాపన

మంచిర్యాలటౌన్, మార్చి 11: మంచిర్యాల పట్టణంలోని రంగంపేట, పవర్‌సిటీ కాలనీ, శ్రీలక్ష్మీనగర్, అండాలమ్మకాలనీ ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. ఈ ప్రాంతాలకు బైపాస్ రోడ్డుతో కనెక్టివిటీ కోసం మధ్యలో ఉన్న రాళ్లవాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 13.50 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 10న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు రాళ్లవాగుపై లోలెవెల్ కాజ్‌వే ద్వారా ప్రజలు రాకపోకలు సాగించేవారు. 20 ఏళ్ల క్రితం రూ. 80 లక్షలతో ఈ వంతెన నిర్మించారు. వక్షాకాలంలో వరద నీరు ఉప్పొంగడం, వరద ఉధృతికి కాజ్‌వే కొట్టుకుపోవడం, తిరిగి మరమ్మతులు చేసేదాకా రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇతర మార్గాల ద్వారా తమ గమ్య స్థానాలకు చేరుకోవడం జరుగుతుండేది. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులను కలిసి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలని కోరారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మంచిర్యాల ప్రజల చిరకాల కోరిక నెరవేరినట్లవుతుంది. వంతెన నిర్మాణం పూర్తయితే పట్టణానికి పడమటి దిశగా రాళ్లవాగుకు అవతల ఉన్న ప్రాంతాలతో రవాణా సౌకర్యాలు మెరుగవనున్నాయి.

వైద్య శిబిరం

చెన్నూర్ రూరల్, మార్చి 11: కిష్టంపేట పల్లె దవాఖాన, అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సంకారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 42 మందికి పరీక్షలు చేసి జ్వరం ఉన్న ముగ్గురికి మందులను అందజేశారు. ఇక్కడ డాక్టర్ కృష్ణతేజ, హెచ్ఈవో జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

తాండూర్, మార్చి 11 : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీటీసీ సిరంగి శంకర్, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎండీ ఈసా, నాయకులు శంకర్, సత్యం, విష్ణుకళ్యాణ్, మహేందర్, శివకృష్ణ, ఆదంఖాన్, అఖిల్ పాల్గొన్నారు.

వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ

శ్రీరాంపూర్, మార్చి 11: ఉత్పాదకతలో కీలక పాత్ర పోషించే వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యతను పెంపొందించుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. సోమవారం శ్రీరాంపూర్ ఎంవీటీసీలో నూతన వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు వృతి నైపుణ్యత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గనిలో అధికారులతో పాటు వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు రక్షణపై పర్యవేక్షించాలని కోరారు. ఓరియంటేషన్ ట్రైనింగ్ 10 రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్‌వో టూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఎంవీటీసీ మేనేజర్ వెంకటరామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

శ్రీరాంపూర్, మార్చి 11: శ్రీరాంపూర్ ఓసీపీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు మేనేజర్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి శీలం చిన్నయ్య, ఫిట్ కార్యదర్శి జాన్సన్ మాట్లాడుతూ ఓసీపీలో కార్మికుల ఆరోగ్య రక్షణకు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని, ఓసీపీ క్వారీలో రెస్ట్ హాల్స్, కూలర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆరోగ్య పరిక్షణకు యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి కాల్వ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకర్, షిఫ్ట్ కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాస్, లక్ష్మణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రేంజర్

కాసిపేట, మార్చి 11 : తాటిగూడలో బెల్లంపల్లి అటవీ శాఖ రేంజ్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను సోమవారం బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుభాష్ ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో సామాజికి మార్పు కోసం వాలీబాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్, ఎఫ్ఎస్‌వోలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మోదుగ పూల అందాలు

కన్నెపల్లి, మార్చి 11 : మండలంలోని చేను చెలకలు, రోడ్డు వెంబడి మోదుగ పూల అందాలు కనువిందు చేస్తున్నాయి. ఎండాకాలం ప్రారంభంలో చెట్లన్నీ ఆకులు రాలి మోడువారిన వేళ మోదుగ చెట్లకు పూలు విరబూసి ప్రకృతిని రమణీయంగా చేస్తున్నాయి. రోడ్డు వెంట వెళ్లే వారు మోదుగ చెట్లను చూసి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకుంటున్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మంచిర్యాల అర్బన్: పోషణ ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తాండూర్, మార్చి 11 : గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. పోషణ పక్వాడ్‌లో భాగంగా సోమవారం రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లలందరి పెరుగుదల, పర్యవేక్షణ, పోషక ప్రయోజనాలు గురించి తల్లులు, సంరక్షకులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. 6 నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేస్తూ వారికి 7 నెలల నుంచి అదనపు పౌష్టికాహారం అందించాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమం ఈ నెల 23 వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం తల్లులచే పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాసపల్లిలో పోషణ పక్షోత్సవాలు

దండేపల్లి, మార్చి11: గూడెం జీపీ పరిధిలోని రాసపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రాసన చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆయా ఉన్నారు.

పోషక పదార్థాల ప్రదర్శన

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : పోషణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషక పదార్థాలను ప్రదర్శించారు. పోషక పదార్థాల ఆవశ్యకతను అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సులోచన వివరించారు. ఇక్కడ టీచర్లు రేణుక, లక్ష్మీకాంత, కృష్ణ, సురేఖ, శారద, రమ, లావణ్య పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరిస్తాం

నస్పూర్: ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

నస్పూర్, మార్చి 11 : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, ఎల్ఏ ఆర్ అండ్ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 56 దరఖాస్తులు అందాయని, వీటిని సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చెన్నూర్ టౌన్, మార్చి 11 : ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఉపాధిహామీ ఏపీవో గంగాభవాని, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, పీఆర్ ఏఈ శివకుమార్, నీటిపారుదల శాఖ ఏఈ చేతన్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈఈ సరిత పాల్గొన్నారు.

కోటపల్లిలో ప్రజావాణి..

కోటపల్లి, మార్చి 11 : కోటపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఎంపీడీవో ఆకుల భూమయ్య దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీవో బాలయ్య, ఏఈవో వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్యాలయంలో..

చెన్నూర్,మార్చి 10: చెన్నూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులు సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈ సాయికిరణ్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

తాండూర్‌లో..

తాండూర్, మార్చి 11 : ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు అర్జీలు ఇవ్వగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు.

బెల్లంపల్లిలో ఐదు దరఖాస్తులు..

బెల్లంపల్లి, మార్చి 11 : బెల్లంపల్లి తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఐదు దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ ప్రసాద్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

మందమర్రిలో నాలుగు ..

మందమర్రి రూరల్, మార్చి 11: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ఇక్కడ తహసీల్దార్ చంద్రశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మారండి.. మంచిగా జీవించండి

- మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

మాట్లాడుతున్న మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి

మందమర్రి, మార్చి 11: మారండి.. మంచిగా బతకండని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి షీటర్లకు సూచించారు. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు సర్కిల్ కార్యాలయ ఆవరణలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి మాట్లాడారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కార్యకలాపాలు పోలీసు నిఘాలో ఉన్నాయని, చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని చెప్పారు. షీటర్ల నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులు, నేర ప్రవృత్తి వైపు ప్రేరేపించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పాత పద్ధతులు వదులుకోని వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. మంచిగా మారి సమాజాభివృద్ధికి దోహద పడితే వారి షీట్లను తొలగిస్తామని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సర్కిల్ పరిధిలోని షీటర్లు ఎలాంటి అలజడి సృష్టించకుండా ఉండేందుకు బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మల్లేశం, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆది జాంబవ సంఘం నాయకులు సోమవారం వారివారి కార్యాలయాల్లో కలిసి సన్మానించారు. సంఘం అధ్యక్షుడు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీ శంకర్, ప్రధాన కార్యదర్శి పోశం, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి రాజనర్సు, నాయిని శంకర్, ఎల్లారం, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, గట్టయ్య, నర్సింగరావు, రవి ఉన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తు దారుల ఇబ్బందులు

అదనపు కలెక్టర్ రాహుల్‌కు తమ గోడు విన్నవిస్తున్న మహిళలు

మంచిర్యాలటౌన్, మార్చి 11: ప్రజాపాలన దరఖాస్తులు సమర్పించడానికి దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో మంచిర్యాల మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటున్నారు. ఇంతకు ముందే ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకునేందుకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఇందిరమ్మ ఇండ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్నారు. కరెంటు బిల్లు జీరో రీడింగ్ రాలేదని మరికొందరు వచ్చారు. రెండు రోజులు సెలవులు రావడంతో సోమవారం దరఖాస్తు దారులు ఎక్కువ మంది వచ్చారు. పెద్ద సంఖ్యలో వచ్చిన దరఖాస్తు దారులకు మున్సిపల్ సిబ్బంది సరైన సమాచారాన్ని ఇవ్వక పోవడంపై మహిళలు ఆందోళన వ్యక్తంచేశారు. అదనపు కలెక్టర్ రాహుల్ మహిళల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరెంటు మీటర్ జీరో బిల్ రీడింగ్ రావడం లేదని ఇక్కడకు వస్తే అటు వెళ్లు, ఇటువెళ్లు, ఇక్కడ కాదు, అక్కడ అంటూ తిప్పుతున్నారని పేర్కొనగా, అన్ని వివరాలను తీసుకుని వచ్చి కౌంటర్లలో ఇస్తే సిబ్బంది నమోదు చేస్తారని అదనపు కలెక్టర్ వారితో చెప్పారు.

జీరో కరెంట్ బిల్లుల పరిశీలన

చెన్నూర్ రూరల్, మార్చి 11: సోమన్‌పల్లిలో జీరో కరెంట్ బిల్లులను ట్రాన్స్‌కో డీఈ తైజర్ సోమవారం పరిశీలించారు. మండలంలో జీరో కరెంట్ బిల్లులు రాని లబ్ధిదారులు చెన్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు స్లిప్, రేషన్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకొని జీరో బిల్ పొందాలని సూచించారు. ఇప్పటి వరకు ఉన్న పాత బకాయిలను చెల్లించాలని కోరారు. విద్యుత్ వాడకంలో 200 యూనిట్ల రీడింగ్ దాటితే జీరో బిల్ వర్తించదని, వచ్చిన బిల్లు మొత్తం చెల్లించాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎస్ఈవో శ్రీనివాస్, చెన్నూర్ ఏడీఈ రవికుమార్, ఏఈ భాస్కర్, సిబ్బంది రత్నాకర్, రామకృష్ణ ఉన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

జన్నారం, మార్చి 11 :గ్రామ పంచాయతీలో వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని డీఎల్‌పీవో ధర్మారాణి ఆదేశించారు. సోమవారం పొనకల్ గ్రామ పంచాయతీని తనిఖీ చేసి మాట్లాడారు. కాలనీల్లో చెత్త లేకుండా ప్రతి రోజు ట్రాక్టర్ ద్వారా తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇక్కడ ఎంపీవో రమేశ్, కార్యదర్శి రాహుల్ ఉన్నారు.

ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నిరసన

తాండూర్, మార్చి 11 : ఎలక్ట్రో బాండ్ల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రాజారాం మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎస్‌బీఐ నుంచి ఎంత మొత్తం ఎన్నికల ఎలక్ట్రో బాండ్లు కొనుగోలు చేసిందనే విషయాన్ని వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ముందే తెలియజేయాలన్నారు. ఈ నెల 13 లోపు సుప్రీంకోర్టుకు అన్ని బ్రాంచులు వివరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాజేశం, రాజన్న, మొగిలి, రె